

మాజీ సిఎం రోశయ్య సేవలు మరువలేనివి

ప్రజాశక్తి గోపాలపురం

ఎపి మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య సేవలు మరువలేనివి జిల్లా ఆర్యవైశ్య అధ్యక్షులు వెలగా శ్రీరామమూర్తి అన్నారు. బుధవారం గోపాలపురం ఆర్యవైశ్య ఫంక్షన్ హాల్లో రోశయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీరామమూర్తి మాట్లాడుతూ దేశంలోనే ఆర్యవైశ్యుల ఖ్యాతి పెంచిన మహానుభావుడు రోశయ్య అన్నారు. ఉమ్మడి రాష్ట్రాల అభివృద్ధికి మిగులు బడ్జెట్‌గా ఆవిష్కృతమైందని అన్నారు. ఆయన నిబద్ధతతో పనిచేయడం వల్ల ఆర్థిక శాఖ మంత్రిగా, ముఖ్యమంత్రిగా, గవర్నర్‌గా పదవులు చేపట్టి ఎనలేని సేవలను అందించారన్నారు. ఈ కార్యక్రమంలో కొల్లూరు సత్యనారాయణ, సుతాపల్లి శ్రీను, మద్దు జగన్మోహనరావు, గుబ్బ శ్రీను, పలువురు ఆర్యవైశ్య నాయకులు, సభ్యులు పాల్గొని రోశయ్యకు నివాళులర్పించారు.

నేడే ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నిక

- అన్ని ఏర్పాట్లూ పూర్తి
- 116 పోలింగ్ కేంద్రాలు సిద్ధం
- 16,737 మందికి ఓటు హక్కు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి, యంత్రాంగం

ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల్లో కీలక ఘట్టం నేడు ముగియనుంది. మండలి పోరుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. బుధవారం జిల్లాలోని ఆయా డివిజన్ కేంద్రాల నుంచి ఎన్నికల సిబ్బందికి పోలింగ్ సామగ్రిని పంపిణీ చేశారు. విధుల్లో పాల్గొనబోయే సిబ్బంది ముందు రోజు సాయంత్రం లోపే కేంద్రాలకు చేరుకున్నారు. ఆరుగురు అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారు. రెవెన్యూ డివిజన్ల పరిధిలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల వద్ద బుధవారం 9 గంటల నుంచి పోలింగ్ సిబ్బందికి సామాగ్రి పంపిణీ చేశారు. పోలింగ్ ముగిసిన అనంతరం కాకినాడ జెఎన్‌టియుకె అంబేద్కర్ సెంట్రల్ లైబ్రరీ ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూముల్లో అభ్యర్థుల సమక్షంలో బ్యాలెట్ బాక్సులకు సీలు వేసి, భద్రపరుస్తారు. ఈ నెల 9న జరిగే కౌంటింగ్ ప్రక్రియకు సంబంధించిన కౌంటింగ్ ఏజెంట్ల వివరాలు 7వ తేదీలోపు సమర్పించాలని ఎఆర్ఒ వెంకటరావు తెలిపారు.

ఏజెన్సీలో మధ్యాహ్నం 2 గంటల వరకే పోలింగ్

ఎంఎల్‌సి ఎన్నికలను జిల్లా అంతటా ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ నిర్వహిస్తారు. ఏజెన్సీ ప్రాంతంలోని రంపచోడవరం, ఎటపాక డివిజన్ల పరిధిలో మాత్రం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకూ పోలింగ్ జరుగుతుంది. జిల్లాలోని 16,737 మంది ఓటర్లందరికీ ఓటరు స్లిప్పుల పంపిణీ పూర్తి చేశారు. ఆరుగురు అభ్యర్థులు ఈ ఎన్నికల బరిలో ఉన్నారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలో 116 పోలింగ్ స్టేషన్లలో పోలింగ్ జరగనుంది.

రాజమహేంద్రవరం రూరల్ ఎంఎల్‌సి ఎన్నికల నిర్వహణ కోసం పోలింగ్ సిబ్బంది ఆయా పోలింగ్ కేంద్రాలకు తరలి వెళ్లారని తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. బుధవారం స్థానిక ఆర్ట్స్ కళాశాలలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలింగ్ నిర్వహిణకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. డిసెంబరు 5న ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పోలింగ్ ప్రక్రియ పూర్తయిన తరువాత ఆయా పోలింగ్ సామాగ్రి ఆర్ట్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన రిసెప్షన్ కేంద్రానికి తరలించి, బ్యాలెట్ బాక్సు, ఇతర పత్రాలు భద్రపరచనున్నట్లు తెలిపారు. అనంతరం వాటిని భారీ భద్రత మధ్య కాకినాడకు తరలిస్తామని తెలిపారు. ఓట్ల లెక్కింపు డిసెంబర్ 9న కాకినాడ లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.రిటర్నింగ్ అధికారి, డిఆర్ఒ టి.సీతారామ్మూర్తి మాట్లాడుతూ తూర్పు గోదావరి జిల్లాలో 20 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. మొత్తం ఓటర్ల సంఖ్య 2,904 మంది కాగా పురుషులు 15,97 మంది, మహిళలు 13,07 మంది ఉన్నారన్నారు. ఆర్ట్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి పోలింగ్ మెటీరియల్ తరలింపు ఇతర అనుబంధ విధులను ఆర్‌డిఒలు ఆర్.కృష్ణనాయక్, రాణి సుస్మిత, అర్బన్ తహశీల్దారు పాపారావు, ఎలక్షన్ సూపరింటెండెంట్ జివిఎల్ఎస్.దేవి, డిటి శాస్త్రి ఇతర అధికారులు పర్యవేక్షించారు.



రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాలలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ ప్రశాంతి

కాకినాడ జిల్లాలో పోలింగ్ విధుల్లో 130 మంది

ఎన్నికలకు కాకినాడ జిల్లాలో 130 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. 34 జోన్లు, 56 రూట్లలో జిల్లాలో కాకినాడ, పెద్దాపురం డివిజన్లలో 22 పోలింగ్ స్టేషన్ల పరిధిలో పిఒలు 26మంది, ఎపిఒలు 26, ఒపిఒలు 52 మంది, మైక్రో అబ్జర్వర్లు 22 మంది, రూట్ అధికారులు 24 మందిని నియమించారు. ఎన్నికలకు సంబంధించి పోలింగ్ మెటీరియల్ పంపిణీ కేంద్రమైన మెక్లారిన్ హైస్కూల్లో బుధవారం పోలింగ్ సిబ్బందితో కాకినాడ ఆర్‌డిఒ మల్లిబాబు మాట్లాడారు. కాకినాడ డివిజన్‌లో 11 పోలింగు కేంద్రాలు ఉన్నాయన్నారు. 2519 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారన్నారు. కాకినాడ డివిజన్‌లో 10 మండలాలకు సంబందించి 4 రూట్లు ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ కేంద్రాల్లో విధుల్లో పాల్గొననున్న సిబ్బందికి ఆయన పలు సూచనలు చేశారు.

అభ్యర్థులు సహకరించాలి

ఎన్నిక సంబంధించి బుధవారం కాకినాడ కలెక్టరేట్‌లో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, డిఆర్ఒ జె.వెంకట్రావు అభ్యర్థులతో సమావేశం నిర్వహించారు. పోలింగ్ ప్రక్రియ సజావుగా జరిగేందుకు అభ్యర్థులు సహకరించాలని ఆయన కోరారు. పోలింగ్ ప్రక్రియకు సంబంధించి అధికారి యంత్రాంగం చేసిన ఏర్పాట్లను, సూచనలను ఈ సందర్భంగా వివరించారు.ఈ సమావేశంలో అభ్యర్థులు గంధం నారాయణరావు, కవల నాగేశ్వరరావు, పులుగు దీపక్, నామన వెంకటలక్ష్మి, బొర్రా గోపి మూర్తి తరపున సాధారణ ఏజెంట్ పలివెల వీరబాబు, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి డిడి డి.నాగార్జున, కలెక్టరేట్ ఎన్నికల విభాగం ఉప తహశీల్దార్ ఎం.జగన్నాథం ఇతర ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెద్దాపురం టీచర్ ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని ఆర్‌డిఒ శ్రీ రమణి అన్నారు. డివిజన్లోని 11 మండలాలకు పోలింగ్ సామాగ్రి, సిబ్బంది బస్సులపై తరలింపు ప్రక్రియను ఆమె పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్లోని 11 మండలాల్లో మండల పరిషత్ కార్యాలయాల్లో పోలింగ్ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌పి శ్రీహరిరాజు, సిఐ కె.క్రాంతికుమార్, ఎస్ఐ వి.మౌనిక పాల్గొన్నారు.

గొల్లప్రోలు పోలింగ్‌కు స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఏర్పాట్లు చేశారు. పోలింగ్ కేంద్రం వద్ద పటిష్టమైన బందోబస్తును నియమించారు. మండలంలో 65 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించేందుకు అనువుగా ఏర్పాట్లు చేశారు.

తాళ్లరేవు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మండలంలో 83 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారనని ఎంపిడిఒ కె.సత్యనారాయణ తెలిపారు.

కె.గంగవరం ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహశీల్దార్ బండి మృత్యుంజయరావు తెలిపారు. మండలంలో మొత్తం 76 ఓట్లు ఉన్నాయని, ఇప్పటికే సిబ్బంది పోలింగ్ కేంద్రానికి చేరుకుని పోలింగ్ సజావుగా జరగడానికి కావలసిన చర్యలు తీసుకున్నారని తెలిపారు.

నల్లజర్ల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని జిల్లా కలెక్టరు ప్రశాంతి తనిఖీ చేశారు. పోలింగ్ నిర్వహణపై తగు సూచనలను చేశారు. తగిన గుర్తింపు కలిగి ఉన్న వారిని మాత్రమే పోలింగ్ కేంద్రాల్లోకి అనుమతించాలని పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రంలోకి అనుమతించే ముందు ఓటర్ల జాబితా అనుసరించి ఓటర్ల ను అనుమతించాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు ఖచ్చితంగా పాటించాలన్నారు. మండల పరిధిలో ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకునేలా నల్లజర్ల పాఠశాలలో అన్ని ఏర్పాట్లూ చేసినట్లు తహశీల్దారు పి.కృష్ణారావు, ఎంపిడిఒ పి.సింహాద్రిరావుకు ఎన్నికల నిర్వహణపై కలెక్టర్ సూచనలు ఇచ్చారు.

పెరవలిలో పోలింగ్ కేంద్రాన్ని తహశీల్దారు డి.అచ్యుతకుమారి పరిశీలించారు. మండలంలో 66 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నారని తెలిపారు.

చాగల్లు పోలింగ్ సందర్భంగా 144 సెక్షన్ అమలులో ఉన్నట్లు తహశీల్దారు ఎం.మెరికమ్మ తెలిపారు. చాగల్లులో ఉపాధ్యాయ ఓటర్స్ 58 మంది, కొవ్వూరులో 233 మంది, తాళ్లపూడిలో 60 మంది, కొవ్వూరులో 351 మంది ఉపాధ్యాయ ఓటర్లు పాల్గొంటున్నట్లు తెలిపారు..

తాళ్లపూడి శ్రీపరస పద్మ రాజారావు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని తహశీల్దారు రవీంద్రనాథ్ పరిశీలించారు. మండలంలో 61 మంది టీచర్స్ ఓటు హక్కు వినియోగించుకోనున్నారని ఆయన తెలిపారు. గణాంక అధికారి జోడాల వెంకటేశ్వరరావు, విఆర్ఒ లీల ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు.

ఉండ్రాజవరం తహశీల్దారు పిఎన్‌డి.ప్రసాద్ రెవెన్యూ కార్యాలయం వెనుక ఉన్న డ్వాక్రా భవన్‌లో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. 125 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నట్లు తెలిపారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

యువ ఉత్సవ్ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బుధవారం జిల్లా యువ ఉత్సవ్ పోస్టర్‌ను కలెక్టర్ పి.ప్రశాంతి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వివిధ రంగాల్లో యువతను ప్రోత్సహించడంతో పాటు వారిలో ప్రతిభను పెంపొందించడం లక్ష్యంగా యువ ఉత్సవ్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ రాష్ట్ర ప్రభుత్వ నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో రాజానగరంలో ఆదికవి నన్నయ యూనివర్సిటీలో డిసెంబర్ 11న జిల్లా యువ ఉత్సవ్ పోటీలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ జిల్లా యువ ఉత్సవ్‌లో (ఇండియా-2047) అనే అంశంపై స్పీచ్, పెయింటింగ్, కవిత్వం, మొబైల్ ఫొటోగ్రఫీ విభాగాల్లో వ్యక్తిగత పోటీలు, కల్చరల్ ట్రెడిషనల్, ఫోక్, సైన్స్ ఎగ్జిబిషన్ మేళా పోటీల్లో గ్రూప్, వ్యక్తిగత పోటీలు ఉంటాయన్నారు. జిల్లా స్థాయి పోటీల్లో గెలుపొందిన వారిని రాష్ట్ర స్థాయి క్రీడలకు పంపుతామని తెలిపారు. నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువ అధికారి దూలం కిషోర్ మాట్లాడుతూ ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు నగదు బహుమతులు ఉంటాయన్నారు. వివరాములకు 7095412584 నెంబర్‌లో సంప్రదించాలన్నారు. జిల్లా ప్రణాళికా అధికారి ఎల్.అప్పల కొండ, డిఎంహెచ్ఒ కె.వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

జ్యోతిబాపూలేకు కాంగ్రెస్ ఘన నివాళి

ప్రజాశక్తి-నిడదవోలు

కాంగ్రెస్ నిడదవోలు పట్టణ అధ్యక్షుడు మేడవరపు భద్రం దొర అధ్యక్షతన సంఘసంస్కర్త మహాత్మ జ్యోతిబాపూలే వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి బుధవారం పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల కోసం అహర్నిశలు తపించిన మహోన్నత వ్యక్తి మహాత్మ జ్యోతిబాపూలే అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కో ఆర్డినేటర్ కారింకి వెంకటేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి చిన్నం మురళీకష్ణ, షేక్ జిలాని, మహమ్మద్ అన్వర్ ఖాన్, షేక్ కాసిం, హుస్సేన్ జహ ప్రగళ్లపాటి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఇ తిలక్‌ను కలిసిన సర్పంచ్ స్టాలిన్

జేగురుపాడుకు మెరుగైన విద్యుత్ సరఫరా చేయాలి

ప్రజాశక్తి-కడియం

ఉత్తమ గ్రామ పంచాయతీ జేగురుపాడులో ప్రజలకు అన్ని సౌకర్యాలు మెండుగా ఉన్నా చిన్న గాలి వేస్తే చాలు విద్యుత్ సమస్య తీవ్రంగా వేధిసోతందని సర్పంచ్ యాదల సతీష్ చంద్ర స్టాలిన్ అన్నారు. బుధవారం విద్యుత్ శాఖ ఎస్ఇ తిలక్ కుమార్‌ను కలిసి సమస్య వివరించారు. గత ప్రభుత్వం హయాంలో జేగురుపాడు గ్రామానికి విద్యుత్ సబ్ స్టేషన్‌ను ఎన్నో ప్రయాసలుపడి మంజూరు చేయించుకున్నామని, దీని నిర్మాణం జగనన్న కాలనీలో పూర్తిచేసుకుని ప్రారంభించారని తెలిపారు. సబ్ స్టేషన్ నుండి ఒక కిలోమీటర్ దూరంలో ఉన్న జేగురుపాడుకు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి త్రీ పేస్ విద్యుత్ సరఫరా చెయ్యాలని కోరారు. గ్రామ ప్రజల చిరకాల స్వప్నమైన త్రీ ఫేజ్ విద్యుత్ సరఫరాకు సత్వరమే పనులు చేపట్టాలని స్టాలిన్, ప్రముఖ కాంట్రాక్టర్ కంటిపూడి అమర్ నాథ్ కోరారు.

అసంబద్ధ నిర్ణయాలను రద్దు చేయాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం రూరల్

విద్యాశాఖ అధికారుల అసంబద్ధ నిర్ణయాలను రద్దు చేయాలని కోరుతూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో 'నిరసన ప్రదర్శనలు' నిర్వహించనున్నట్లు జిల్లా కార్యదర్శి రమేష్ తెలిపారు. ఈ మేరకు రూరల్ ఎంఇఒను బుధవారం ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ఈ నెల 11న అన్ని జిల్లా విద్యాశాఖ కార్యాలయాల వద్దా నిరసన ప్రదర్శనలు, 16న రాష్ట్ర విద్యాశాఖ కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించనున్నామని తెలిపారు. గత ప్రభుత్వ పరిపాలనకు, ఈ ప్రభుత్వ పరిపాలనకు పెద్దగా తేడా లేదనే విధంగా విద్యాశాఖ అధికారుల నిర్ణయాలు ఉంటున్నాయని అన్నారు. పాఠశాలల పనివేళల పెంపు, 10 శాతం మించి ఉపాధ్యాయులు సెలవులు పెట్టరాదనే ఆంక్షలు, 10వ తరగతి పరీక్షలకు సంసిద్ధత పేరుతో విడుదల చేసిన 100 రోజుల యాక్షన్ ప్లాన్, విద్యార్థులు వివరాలు అపార్‌లో నమోదు, ఇలా ప్రతి నిర్ణయం అసంబద్ధంగానే ఉంటున్నాయని తెలిపారు. ముఖ్యంగా మండలాల్లో 10 శాతం మించి ఉపాధ్యాయులు సెలవులు పెట్టరాదని ఎంఇఒలు అత్యవసర సందర్భాల్లో కూడా సెలవులు మంజూరు చేయడం లేదన్నారు. అనారోగ్యం బారిన పడినవారికి సైతం సెలవులు మంజూరు చేయకపోవడంతో ఉపాధ్యాయులు ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. ఇప్పటికే విద్యార్థుల అపార్ నమోదు విషయంలో పలు ఇబ్బందులు పడుతున్నామని వివరించారు. ఇలాంటి పరిస్థితుల్లో 100 రోజుల యాక్షన్ ప్లాన్లో ఆదివారాలు, పండుగ దినాల్లో సైతం పనిచేయాలంటూ ఇచ్చిన ఉత్తర్వుల పట్ల ఉపాధ్యాయులు తీవ్ర అసంతప్తి వ్యక్తం చేస్తున్నారని వివరించారు. ఈ అసంబద్ధ నిర్ణయాలు ఉపాధ్యాయులను తీవ్ర ఆందోళనకు, మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నాయి. విద్యాశాఖ అసంబద్ధ నిర్ణయాలను రద్దు చేయాలనే డిమాండ్‌తో యుటిఎఫ్ రాష్ట్రమంతటా నిరసన ప్రదర్శనలు చేపట్టాలని నిర్ణయించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ అధ్యక్షులు జనార్ధన్, కార్యదర్శి శ్రీనివాస్ కోశాధికారి అనిల్, ప్రకాష్, నానాజీ, సత్యనారాయణ, సరోజిని, సునీల్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందిస్తున్న యుటిఎఫ్ నాయకులు

వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

వ్యవసాయ అనుబంధ, సంక్షేమం, వైద్య ఆరోగ్యశాఖ, హౌసింగ్, ఉపాధి హామీ, ఇంజినీరింగ్ తదితర విభాగాల జిల్లా అధికారులతో కలెక్టరేట్‌లో బుధవారం కలెక్టర్ పి.ప్రశాంతి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వివిధ పనుల పురోగతిపై 100 రోజులు, 200 రోజుల కార్యాచరణ ప్రణాళిక నిర్దేశించినట్టు తెలిపారు. ఈ క్రమంలో డిసెంబర్ 10న ముఖ్యమంత్రి సమక్షంలో జిల్లా కలెక్టర్లతో సమావేశం నిర్వహించనున్నారని తెలిపారు. ఆయా శాఖలు నిర్దేశించిన లక్ష్యాలను సాధించడంలో ఇతర అనుబంధ శాఖల సమన్వయంతో లక్ష్యాలను సమర్థవంతంగా చేపట్టాల్సి ఉందన్నారు. క్షేత్ర స్థాయిలో పనుల పురోగతి, బడ్జెట్ కేటాయింపులు, పెండింగ్ బిల్లులు అత్యవసరంగా చేపట్టాల్సిన పనులు, రాష్ట్ర స్థాయి నుంచి రావాల్సిన అనుమతులు తదితర అంశాల ఆధారంగా పిపిటి రూపొందించి అందచేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రణాళిక అధికారి ఎల్.అప్పల కొండ, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.జయరామ లక్ష్మి, డిఎంహెచ్ఒ కె.వెంకటేశ్వర రావు, జిల్లా ఆర్ అండ్ బి అధికారి ఎస్‌బివి.రెడ్డి, డ్వామా పీడీ ఎం.నాగ మహేశ్వర రావు, డిఇఒ కె.వాసుదేవ రావు, డిఎస్‌పి డికె.విజయ్ కుమారి, గిరిజన సంక్షేమ అధికారి కె.ఎన్ జ్యోతి, సాంఘిక సంక్షేమ అధికారి ఎం.సందీప్ పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి



వెంకటేష్‌ను అభినందిస్తున్న కోరుకొండకు చెందిన టిడిపి నాయకులు

మాజీ ఎంఎల్‌ఎ వెంకటేష్‌కు క్యాబినెట్ హోదా

ప్రజాశక్తి - సీతానగరం, కోరుకొండ

రాజానగరం మాజీ ఎంఎల్ఎ పెందుర్తి వెంకటేష్‌ను ముఖ్యమంత్రి కార్యక్రమాలకు సమన్వయకర్తగా రాష్ట్ర మంత్రి హోదాను కేటాయిస్తూ బుధవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వెంకటేష్‌కు రాష్ట్ర మంత్రి హోదాను కేటాయించినట్లు అదేశాలు అందాయి. బాధ్యతలు స్వీకరించిన తేదీ నుండి మంత్రి కార్యక్రమాలు మరియు ఆయన రాష్ట్ర ప్రాధాన్యత యొక్క ఆర్టికల్ 18లో ర్యాంక్ కలిగి ఉంటారని ప్రభుత్వం తెలిపింది. రాజానగరం నియోజకవర్గం నుండి రెండుసార్లు వెంకటేష్ ఎంఎల్ఎగా ఎన్నికయ్యారు. వెంకటేష్ మాట్లాడుతూ ప్రజలు తనకిచ్చిన గౌరవంగా భావిస్తున్నానని తెలిపారు. ప్రజలు మనసులో ఉన్న వ్యక్తులను అధిష్టానం గుర్తిస్తుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. నమ్ముకున్న కేడర్, అభిమానులు తనపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేస్తానన్నారు. తన నియామకంపై బుధవారం రాజానగరం నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న అభిమానులు, టిడిపి క్యాడర్ మొత్తం రాజమండ్రిలో వెంకటేష్ నివాసానికి చేరుకుని శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలో వెంకటేష్ అభిమానులు ఆయా గ్రామాల్లో సంబరాలు చేసుకున్నారు.

వృద్ధాశ్రమంలో తోటబాబు 5వ వర్ధంతి

ప్రజాశక్తి-కడియం

రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలోని పలు పంచాయతీల్లో విధులు నిర్వహించిన కొనగళ్ల తోటబాబు 5వ వర్ధంతిని బుధవారం వద్ధాశ్రమంలో నిర్వహించారు. మండలంలోని వేమగిరి పంచాయతీ జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన భార్య కొనగళ్ళ జ్యోతి ఆధ్వర్యంలో వేమగిరి పుష్కర మాత వద్ధాశ్రమంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా వృద్ధుల సమక్షంలో తోటబాబు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఆశ్రమంలోని వృద్ధులకు మధ్యాహ్నం విందు భోజనం ఏర్పాటు చేశారు. వివిధ రకాల ఫలాలను అందజేశారు. మృదుభాషి, స్నేహశీలి అయిన తోటబాబు భౌతికంగా ఆయన లేకపోయినా ఆయన చేసిన పలు సేవా కార్యక్రమాలతో సజీవంగానే ఉన్నారని పలువురు వక్తలు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన కుటుంబ సభ్యులతో పాటు స్నేహితులు పాల్గొన్నారు.

6 నుంచి రెవెన్యూ సదస్సులు

ప్రజాశక్తి-చాగల్లు


చాగల్లు మండలంలో 6వ తేదీ నుండి 20వ తేదీ వరకు గ్రామాల వారీగా రెవిన్యూ సదస్సులు నిర్విస్తున్నట్టు తహశీల్దార్ ఎం.మేరికమ్మ తెలిపారు. 6న ధారవరం, 7న బ్రాహ్మణగూడెం, 9న ఎస్.ముప్పవరం, 10న ఊనగట్ల, 11న చిక్కాల, 12న చాగల్లు, 13న నెలటూరు, 16, 17న మల్లవరం, 18న మార్కొండపాడు, 19న నందిగంపాడు, 20న కలవలపల్లిలో ఆయా గ్రామ పంచాయతీల వద్ద రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు.

ప్రొఫెసర్‌పై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

తిరుపతి ఎస్‌వి యూనివర్సిటీ ప్రొఫెసర్ చంగయ్యపై ఇటీవల దాడి చేసిన భజరంగ్ దళ్, విహెచ్‌పి నాయకులను అరెస్టు చేసి, వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని బిఎస్‌పి నాయకులు డిమాండ్ చేశారు. ఈ విషయమై బుధవారం ఉతహశీల్దారు కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా బిఎస్‌పి నాయకులు మాట్లాడుతూ ప్రొఫెసర్ చంగయ్య క్రైస్తవ మత ప్రచారం చేస్తున్నారనే నెపంతో విహెచ్‌పి, ఆర్‌ఎస్ఎస్, భజరంగ్ దళ్ శక్తులు ఆయన ఛాంబర్‌లోకి దౌర్జన్యంగా ప్రవేశించి, ఆయనపై దాడి చేసి, వస్తువులను ధ్వంసం చేశారన్నారు. ఆయన కారును కూడా రాళ్లతో ధ్వంసం చేసి, ఆయనపై హత్యా ప్రయత్నం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మర్రి మహాలక్ష్ముడు, బత్తిన ఆశీర్వాదం, చెల్లాబత్తుల సత్యానందం, గుమ్మాపు శ్రీను, బద్దా జాన్, నూక పేయి పునీత్, చదలవాడ రాంబాబు, బొజ్జి, పాస్టర్స్ షారోన్, జె.దానియేలు, సుధాకర్, దుర్గారావు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



ఆదర్శలో నూరు శాతం ఉత్తీర్ణత

ప్రజాశక్తి-గోకవరం

కాకినాడ జెఎన్‌టియు బిఫార్మసీ నాలుగో సంవత్సరం పరీక్షా ఫలితాలలో ఆదర్శ విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ త్రినాథ్ తెలిపారు. రాష్ట్రంలో ఏ కాలేజీ సాధించలేనిది ఆదర్శ కాలేజీ విద్యార్థులు నాలుగో సంవత్సరంలో 27 మంది వివిధ కంపెనీలకు ఇంటర్న్‌షిప్‌కు వెళ్లారని వైస్ ప్రిన్సిపల్ సుజిని తెలియజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ కనకరాజు మాట్లాడుతూ విద్యార్థుల్లో అత్యున్నత నైపుణ్యాన్ని పెంపొందించడం ఆదర్శ గొప్పతనమనాత్రఉ. నాలుగో సంవత్సరం విద్యార్థులు గత సంవత్సరం జాతీయస్థాయిలో జిపి ఎటి నందు ర్యాంకులు సాధించారని తెలిపారు. దీనికి మరొక ఉదాహరణ గతవారం కాకినాడ జెఎన్‌టియు యూనివర్సిటీలో జరిగిన క్యాంపస్ సెలక్షన్స్‌లో ఆదర్శ విద్యార్థులు ఎంపిక కావడం అభినందనీయమని తెలిపారు. నూరు శాతం ఉత్తీర్ణ సాధించిన విద్యార్థులను అధ్యాపక బృందాన్ని అభినందించారు. సెక్రటరీ నాగమణి మాట్లాడుతూ విద్యార్థుల నైపుణ్యాన్ని పెంపొందించడానికి ఈ సంవత్సరం వృత్తి నైపుణ్య తరగతులను ఎక్కువగా చెప్పారన్నారు. అధ్యాపక బృందం ఎంతో శ్రద్ధతో విద్యార్థులను తీర్చిదిద్దడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కో ఆర్డినేటర్ పి.శ్రీనివాస్ కామేష్, డాక్టర్ పైడిరాజు, ప్రేమ్ కుమార్, డాక్టర్ గణేష్, సంకీర్తన, భార్గవి, దీప్తి, డాక్టర్ ప్రవీణ్, దీపిక, శిరీష, ప్రీతి, స్వర్ణ తదితర అధ్యాపక బందం విద్యార్థులకు అభినందనలు తెలిపారు.



ఉత్తీర్ణులైన ఆదర్శ కళాశాల విద్యార్థులు



రెస్టారెంట్‌ను ప్రారంభిస్తున్న సువర్ణ రాజు

అవినీతి లేని పాలన అందజేతకు కృషి

ప్రజాశక్తి-నల్లజర్ల

కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివద్ధి ప్రజల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ అవినీతి లేని పరిపాలన అందిస్తోందని జనసేన పార్టీ గోపాలపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి దొడ్డిగర్ల సువర్ణ రాజు అన్నారు. మండలంలోని ప్రకాశరావు పాలెంలోని ఆవుపాడు రోడ్డులో రాచమల్ల కుటుంబం ఏర్పాటు చేసిన శ్రీ విద్యా రెస్టారెంట్‌ను ఆయన బుధవారం ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ అవకాశాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రకాశరావుపాలెం సర్పంచ్ కొత్తూరి జాన్ విక్టర్ బాబు, ఆవుపాడు సర్పంచ్ జిల్లా జనసేన కార్యదర్శి అచ్యుత సత్యనారాయణ, మాజీ సర్పంచ్ నీలపాల నరసింహ, కొనకళ్ల సుబ్రహ్మణ్యం, శ్రీను, సాయి ప్రసాద్ పాల్గొన్నారు.

కనీస మద్దతు ధర చెల్లించాలి

మిల్లర్లకు జెసి టి.నిషాంతి సూచన

ప్రజాశక్తి - అమలాపురం

రైతు పండించిన వరి ఉత్పత్తులకు తేమ శాతం కొద్దిగా ఎక్కువగా ఉన్న ఎటువంటి తరుగులు విధించకుండా కనీస మద్దతు ధరలు చెల్లించేలా మిల్లర్లకు జెసి టి.నిషాంతి సూచించారు. ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అన్ని పారామీటర్లలో ధాన్యం నాణ్యత పరీక్షలు నిర్వహించేందుకు సాంకేతిక సహాయకులు, గ్రామ వ్యవసాయ సహాయకులు తదితరులు అందుబాటులో ఉంటూ రైతులకు అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు. గోనె సంచులు సరఫరా, హమాలీలు నియామకం రవాణా ఏర్పాట్లను ప్రభుత్వపరంగా కల్పిస్తామన్నారు. ధాన్యం విక్రయాలకు సంబంధించి ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లను చేసిందన్నారు. మండల స్థాయిలోను డివిజన్ జిల్లా స్థాయి లోనూ కంట్రోల్ రూములు ఏర్పాటు చేసి రైతాంగ సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరిస్తున్నామని అన్నారు. జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ద్వారా రైతులు పండించిన ధాన్యాన్ని కాపాడుకునే బరకాలు సరఫరా చేస్తున్నట్లు ఆమె వెల్లడించారు. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటలలో ప్రతి రైతుకు ధాన్యం సొమ్ములు వారి వారి బ్యాంకు ఖాతాకు జమ అవుతున్నాయని ఆమె స్పష్టం చేశారు.

6 నుంచి రెవెన్యూ గ్రామసభలు

రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సమస్యలపై దృష్టి సారించి ఈ నెల 6 నుంచి రానున్న 2025 జనవరి 8 వరకు రెవెన్యూ గ్రామసభలను గ్రామస్థాయిలో నిర్వహించనున్నట్లు జెసి టి.నిషాంతి తెలిపారు. బుధవారం రాష్ట్ర భూ పరిపాలన ముఖ్య కమిషనర్ జి.జయలక్ష్మి అమరావతి నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి రెవెన్యూ సదస్సుల నిర్వహణ విధివిధానాలు పట్ల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లకు దిశా నిర్దేశం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ గ్రామస్థాయిలో భూ వివాదాల పరిష్కారానికి రెవెన్యూ గ్రామసభలను డిసెంబరు 6 నుంచి జనవరి 8 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమస్యల పరిష్కారంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించి గ్రామస్థాయిలో భూ వివాదాల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. ఈ మేరకు ప్రభుత్వం వీటి నిర్వహణకు షెడ్యూలు ప్రకటించిందన్నారు. 22 ఎ, ఫ్రీ హోల్డ్, భూ ఆక్రమణలపై ఫిర్యాదులు స్వీకరించనున్నారన్నారు. గ్రామ, మండల, జిల్లా స్థాయిలో షెడ్యూల్ ప్రకటించాలని ఆదేశాలు జారీ చేశారన్నారు. ప్రజల నుంచి పిటిషన్ల తోపాటు ఆర్‌టిజిఎస్, ఎపి సేవ పోర్టల్ ద్వారా అర్జీలు తీసుకోవాలని ప్రభుత్వం స్పష్టం చేసిందన్నారు. గ్రామ స్థాయిలో షెడ్యూల్ ప్రకటించి, సదస్సు నిర్వహణకు ముందే సదరు గ్రామానికి సమాచారం ఇవ్వాలని ఆమె స్పష్టం చేశారు. భూ వివాదాలు తగ్గించేలా రెవెన్యూ సదస్సులు ఉండాలని, భూ సమస్యల పరిష్కారానికి ఎటువంటి రుసుము వసూలు చేయరని ఆమె స్పష్టం చేశారు. వీలైనంత వరకు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించే దిశగా చర్యలు చేపడతారన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న జెసి టి.నిషాంతి

అక్కడికక్కడే పరిష్కారానికి ఆస్కారం లేని సమస్యలను నిర్దేశిత ప్రొసీజర్ ప్రకారం తదుపరి పరిష్కరిస్తారన్నారు. ఆక్రమణల్లో భూములు కోల్పోయిన బాధితులకు అండగా నిలిచి న్యాయం చేకూర్చాలన్నారు. భూ వివాదాల పరిష్కారమే ధ్యేయంగా ఈ సదస్సులు నిర్వహిస్తారన్నారు. భూ వివాదాల పరిష్కారం కోసం ప్రజల నుంచి గ్రామ సభల ద్వారా వచ్చిన అభ్యర్ధనలు, ఫిర్యాదులపై ప్రజలకు రశీదు అందిస్తారన్నారు. రీ-సర్వే పూర్తయిన గ్రామాల్లో నిర్వహించిన సభల ద్వా రా వచ్చిన ఫిర్యాదులు వినతుల్లోని సమాచారానికి అనుగుణంగా సర్వే శాఖ చర్యలు చేపట్టిందన్నారు. జిల్లా వ్యాప్తంగా 22 మండలాల్లో 431 గ్రామ రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తారన్నారు. ఈ సదస్సుల్లో తహాశీల్దార్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, విఆర్‌ఒలు, సర్వేయర్లు తదితరులు పాల్గొంటారన్నారు.

ఘనంగా వికలాంగుల దినోత్సవం

ప్రజాశక్తి - ముమ్మిడివరం

నగర పంచాయతీ కార్యాలయం నందు బుధవారం పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో వికలాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని నగర పంచాయతీ పరిధిలోని వికలాంగులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వికలాంగులను చిన్నచూపు చూడకుండా, తోటి వారితో సమానంగా చూడాలన్నారు. వారు సమాజంలో ఒక భాగమేనని వారికి సమాన అవకాశాలు హక్కులు ఉన్నాయనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించవలసిన అవసరం అవసరం ఎంతైనా ఉందన్నారు. వికలాంగులకు ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ పి.రవి వర్మ, మెప్మా సిఎంఎం ఎస్.భాస్కర్, సిఇ రాజేశ్వరి, ఆర్‌పిలు, వికలాంగులు తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఎంఎల్ఎ వేగుళ్ల పరామర్శ

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

ఇటీవల మరణించిన పలువురు కుటుంబ సభ్యులను బుధవారం రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు పరామర్శించారు. కపిలేశ్వరపురం మండల పరిధి కాలేరులో ఇటీవల మరణించిన పాలచర్ల నారాయణరావు, రిమ్మలపూడి రామోజి, యినపకోళ్ళ అనంతలక్ష్మికుటుంబ సభ్యులను ఎంఎల్ఎ పరామర్శించారు. వాకతిప్ప లో జాస్తి రామారావు కుటుంబ సభ్యులను, అంగర లో బుడుమూరి రాజారావు కుటుంబ సభ్యులను ఎంఎల్ఎవేగుళ్ళ పరామర్శించి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఎంఎల్ఎ వెంట చుంద్రు రామకష్ణ చౌదరి, గుణ్ణం సత్యనారాయణ, వల్లూరి కాశీవిశ్వనాథం, చుంద్రు గణేశ్వరరావు, దాయం శేఖర్ బాబు, అల్లూరి రామకృష్ణ చౌదరి తదితరులు ఉన్నారు.

నేరాలు ఘోరాలు

వ్యక్తి అదృశ్యంపై కేసు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

పట్టణంలోని పల్లపువీధికి చెందిన షేక్ ఖాదరవల్లి అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ పి.రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం. పల్లపు వీధిలో షేక్ ఖాదరవల్లి భార్య నాగమణితో కలిసి ఉంటున్నారు. 2023 ఏప్రిల్ 20వ తేదీన బయటకు వెళ్లిన ఖాదరవల్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో భార్య నాగమణి తన భర్తకు ఫోన్ చేయగా రెండు మూడు రోజుల్లో వస్తానని చెప్పాడు. కానీ రాలేదు. కాకినాడ రూరల్ మండలం ఇంద్రపాలెంలో ఉంటున్న అత్తమామలను అడిగితే వారి నుంచి సరియైన సమాధానం రావడం లేదని, దీనిపై భార్య నాగమణి ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఖాదరవల్లి భార్య నాగమని ప్రస్తుతం కాజులూరులో టీచర్‌గా పని చేస్తున్నారు.

గ్యాస్ బండ పేలి టీ స్టాల్ దగ్ధం

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

ఉప్పాడ - పిఠాపురం రోడ్‌లో టీ ట్రెండ్ షాపులో బుధవారం గ్యాస్ బండ పేలడంతో టీ షాపు దగ్ధమైంది. పిఠాపురం అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఉద్దండు సత్తిబాబు షాపును అద్దెకు తీసుకుని టీ ట్రెండ్ షాపు నిర్వహిస్తున్నాడు. గ్యాస్ ఫైర్ అవడంతో షాపు పూర్తిగా దగ్ధం కాగా, సుమారు రూ.3 లక్షల వరకూ నష్ట వాటిల్లినట్లు బాధితుడు సత్తిబాబు తెలిపాడు.

ట్రాక్టర్‌ను ఢీకొని వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - కరప

పాతర్లగడ్డ రహదారిపై ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొన్న వ్యక్తి గాయాలపాలయ్యాడు. బుధవారం మధ్యాహ్నం పాతర్లగడ్డ గ్రామం సమీపంలో కాజులూరు మండలం కాజులూరు గ్రామానికి చెందిన కంపసత్తి సురేష్ కోళ్లను కట్టుకొని బైక్‌పై మాధవపట్నం నుంచి కాజులూరు వెళ్ళుతూ రోడ్డు పక్కనే ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో అతని తలకు బలమైన గాయం అయింది. 108లో కాకినాడ జిజిహెచ్‌కు తరలించారు.

17 మద్యం సీసాల స్వాధీనం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని చంద్రమాంపల్లి గ్రామంలో నిర్వహించిన దాడుల్లో ఒక వ్యక్తి నుంచి 9 మద్యం సీసాలు, జగ్గంపేట మండలం కాట్రావులపల్లి గ్రామంలో నిర్వహించిన దాడుల్లో ఒక మహిళ నుంచి 8 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని వారిపై కేసులు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సిఐ కెవివిడి.అర్జున్‌రావు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐలు చిట్టిబాబు, ప్రసాదరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పిడిఎస్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని వేలివెన్ను జోగిరాజు కోళ్ల ఫారంలో సుమారు రూ.80 వేల విలువైన 1,836 కేజీల పిడిఎస్ బియ్యాన్ని పట్టుకుని నిందితులపై 6 ఎ కేసు నమోదు చేసినట్టు సహాయ పౌరసరఫరాల అధికారి ఎం.నాగాంజనేయులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పిడిఎస్ రైస్‌ను అక్రమంగా కొనుగోలు చేసి, నూకగా ఆడించి, కోళ్లకు మేతగా వాడుతున్నట్లు సమాచారం రావడంతో మండలంలోని పౌల్ట్రీలలో తనిఖీలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ తనిఖీల్లో సివిల్ సప్లై డిప్యూటీ తహశీల్దార్ సుధీర్, ఎస్ఎస్.రెడ్డి, వేలివెన్ను విఆర్‌ఒలు మురళి, ఏసుపాదం పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం ఇద్దరు అరెస్ట్

కోరుకొండ మండలంలోని శ్రీరంగపట్నం గ్రామం నుండి వ్యాన్‌పై తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని కోరుకొండ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కోరుకొండ ఎస్ఐ టి.శ్యాంసుందర్ తెలిపిన వివరాల ప్రకారం తమకు ముందుగా వచ్చిన సమాచారం ప్రకారం మంగళవారం సాయంత్రం శ్రీరంగపట్నం నుండి వస్తున్న వ్యాన్ ను తనిఖీ చేయగా రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించామన్నారు. వ్యాన్‌లో సుమారు రూ.1.38 లక్షల విలువచేసే రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేశామని తెలిపారు.

యువకుని ఆత్మహత్య

ప్రజాశక్తి-నల్లజర్ల

మండలం నబీపేటలో ఒక యువకుడు సోమవారం సాయంత్రం అనంతపల్లి వద్ద పోలవరం కుడి కాలువలోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. బంధువులు, స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం మర్రి నవీన్ (23) కూలి పని చేస్తూ ఉంటాడు. సోమవారం సాయంత్రం అనంతపల్లి సైఫాన్ బ్రిడ్జి వద్దకు వెళ్లి తన అన్నకు ఫోన్ చేసి తాను సైఫాన్ బ్రిడ్జి వద్ద ఉన్నానని బతుకు మీద విరక్తి చెందిందని కాలువలోకి దూకి చనిపోతున్నట్టు తెలియజేసి వెంటనే కాలువలోకి దూకేశాడు. బుధవారం ఎన్‌డిఆర్ఎఫ్ బృందం గాలించగా మృతదేహం లభ్యమయ్యింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సిఐ నక్క శ్రీనివాస్ తెలిపారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - ముమ్మిడివరం

మనస్తాపంతో ఈ నెల 3న ఒక వ్యక్తి ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య పాల్పడ్డాడు. బుధవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని క్రాప చింతలపూడి పాలెం గ్రామానికి చెందిన బూరుగు వెంకటేశ్వరరావు ఏలియాస్ కొండయ్య (63)కు భార్య సత్యవతి, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ముగ్గురు కుమార్తెలకు వివాహం జరిపించగా, కుమారుడు కొన్నేళ్ల క్రితం మరణించాడు. చెందాడు. అప్పటినుండి వెంకటేశ్వరరావు మనోవేదనకు గురయ్యాడు. భార్య సత్యవతి ముమ్మిడివరం ప్రభుత్వ ఆసుపత్రిలో కాంట్రాక్ట్ పద్ధతిలో స్వీపర్‌గా పనిచేస్తోంది. మనస్తాపంతో మంగళవారం వెంకటేశ్వరరావు ఇంటి వద్ద ఉన్న మామిడి చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు కుటుంబ సభ్యుల సమాచారం మేరకు ఎస్ఐ డి జ్వాలా సాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బాలిక అదృశ్యంపై ఫిర్యాదు

ప్రజాశక్తి - రామచంద్రపురం

రామచంద్రపురం చిన్న మసీదు వీధికి చెందిన బాలిక ఈనెల 3న ఉదయం 9 గంటల నుంచి కనబడలేదని షేక్ జానీ ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి రామచంద్రపురం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన తెలిసిన ఈ కింద ఇవ్వబడిన ఫోన్ నంబర్లు ఎస్ఐ రామచంద్రపురం 94407 96589 పోలీస్ స్టేషన్ నెంబర్ 08857 242333 తెలియజేయాలని పోలీసులు విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

గ్రామాల్లో అందని తాగునీరు

శివల, పాతకోట గ్రామాల్లో ప్రజల ఇక్కట్లు

ప్రజాశక్తి - రామచంద్రపురం

తాగునీటికి ఇక్కట్లు తప్పడం లేద ని కె.గంగవరం మండలంలోని శివల, పాతకోట గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు శివల గ్రామంలో తాగునీటి ట్యాంక్ ఉన్నప్పటికీ వారం రోజులుగా అంతరాయం ఏర్పడి తాగునీరు సరఫరా తగ్గిపోయిందని, దీనితో గ్రామస్తులు అవస్థలు పడుతున్నారని గ్రామానికి చెందిన విత్తనాల కిరణ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. అదేవిధంగా గోదావరి చెంతనే ఉన్న పాతకోట గ్రామానికి వారం రోజులుగా ఒక పూట నీరు సరఫరా అవుతోంది రెండు రోజులుగా మొత్తం సరఫరా నిలిచిపోయిందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే ఆయా గ్రామాల్లో తాగునీటిని పునరుద్ధరించాలని అధికారులను ప్రజా ప్రతినిధులను గ్రామస్తులు కోరుతున్నారు.

మోటారు కాలిపోవడంతో సరఫరాకు అంతరాయం: కార్యదర్శి సుబ్బారావు వివరణ

తాగునీరు సరఫరా నిలిచిపోయిందని శివల గ్రామ కార్యదర్శి ఎస్. సుబ్బారావును ప్రజాశక్తి వివరణ కోరగా ఆదివారం మోటార్ కాలిపోయిందని దీనితో మంచినీరు సరఫరా అంతరాయం ఏర్పడిందన్నారు. దీనితో ప్రత్యామ్నాయం గా 3 హెచ్‌పి మోటారు తో నీటి సరఫరా చేస్తున్నామని అది చివరి వరకు వెళ్లడం లేదని రెండు రోజుల్లో సమస్య పరిష్కారం అవుతుందన్నారు.

రెండురోజుల్లో తాగునీటి సమస్య పరిష్కారం : పాతకోట కార్యదర్శి రామకృష్ణ

పాతకోట గ్రామంలో మంచినీటి సరఫరా


శివల గ్రామంలో నిరుపయోగంగా వాటర్ ట్యాంక్

నిలిచిపోవడంపై గ్రామ కార్యదర్శి శాఖ రామకృష్ణ ను వివరణ కోరగా గ్రామానికి ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ హైవోల్టేజ్ కారణంగా కాలిపోయిందని విషయం మంత్రి సుభాష్ దృష్టికి తీసుకెళ్లాం. కొత్త ట్రాన్స్‌ఫార్మర్ రాగానే దాన్ని బిగించి మంచినీటి సరఫరా పునరుద్ధరిస్తామని రెండు రోజుల్లో సమస్య పరిష్కారం అవుతుందని వివరించారు.


మద్యం అమ్ముతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ సిఐ కాత్యాయని

239 మద్యం సీసాల స్వాధీనం.. వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి - పి.గన్నవరం

పి.గన్నవరంలో 239 మద్యం సీసాల స్వాధీనం చేసుకుని ఒక వ్యక్తి అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ సిఐ కె.కాత్యాయని తెలిపారు. బుధవారం సిఐ తెలిపిన వివరాలు ప్రకారం.. పిగన్నవరం మండలం కె.ఏనుగుపల్లి గ్రామానికి చెందిన మట్టపర్తి ఫణి కుమార్ పి.గన్నవరం సెంటర్‌లో గల బాలాజీ వైన్స్ షాపు వెనకాల బడ్డీ కొట్టు నిర్వహిస్తున్నాడన్నారు. షాపులో బెల్ట్ షాప్ నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో బుధవారం దాడి చేసి ఫణి కుమార్‌ను అదుపులోకి తీసుకున్నామని రిమాండ్ కి తరలించామని ఎక్సైజ్ సిఐ తెలిపారు. మద్యం సీసాలు ఏ షాపు నుంచి వచ్చాయో దర్యాప్తులో తెలియాల్సి ఉందన్నారు.

విద్యార్థులకు ప్రాక్టికల్స్‌పై శిక్షణ

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక ఎసిటి సైన్స్ సెంటర్‌లో బుధవారం స్థానిక వీర్రాజు హైస్కూల్, చాచా విద్యా నికేతన్ స్కూల్ 10 వ తరగతి విద్యార్థులకు వివిధ అంశాలపై ప్రాక్టికల్స్‌లో శిక్షణ ఇచ్చారు. సైన్స్ సెంటర్ నిర్వాహకులు బుద్దా శ్రీనివాస్ ఆధ్వర్యంలో లోహాలు, అలోహాలు, మానవ కన్ను, రంగుల ప్రపంచం వంటి అంశాలపై విద్యార్థులతో ప్రాక్టికల్స్ నిర్వహించారు. విద్యార్థులకు గైరోస్కోప్ సూత్రాలు అర్థమయ్యే రీతిలో వివరించారు. మన పెద్దాపురం ఫేస్‌బుక్ బృందం సైన్స్ సెంటర్‌ను సందర్శించింది. ఈ సందర్భంగా మిషన్ అన్నపూర్ణ సహాయనిధి వ్యవస్థాపకులు దేవత రాజేష్ కుమార్ విద్యార్థులకు స్నాక్స్ పంపిణీ చేశారు.

వరుడు వంశీకి ఎంఎల్ఎ గిడ్డి శుభాకాంక్షలు

ప్రజాశక్తి -మామిడికుదురు

లూటుకుర్రు (బాడి లంక)కి చెందిన జనసేన సీనియర్ నాయకుడు విళ్ల సుబ్బారావు కుమారుని వివాహం బుధవారం రాత్రి చాకలిపాలెం కృష్ణ బాలాజీ ఫంక్షన్ హాల్లో నిర్వహించారు. ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ సుబ్బారావు స్వగృహంలో వరుడు వంశీ సాయి మణికంఠను ఆశీర్వదించారు. సర్పంచుల సమాఖ్య నియోజకవర్గ అధ్యక్షుడు అడబాల రామ సత్యనారాయణ (తాతకాపు) జనసేన మండల అధ్యక్షుడు జాలెం శ్రీనివాసరాజా, పలువురు కూటమి నాయకులు పాల్గొనిసాయి మణికంఠను ఆశీర్వదించారు


వరుడు వంశీని ఆశీర్వదిస్తున్న ఎంఎల్ఎ గిడ్డి

సొసైటీ సిఇఒ ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - రాజోలు

మలికిపురం మండలం గూడపల్లి సొసైటీ సిఇఒ నూకల వీర వెంకట సత్యనారాయణ బుధవారం ఉదయం తన ఇంట్లో నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. రాజోలు డిసిసిబి పరిధిలోకి వచ్చే గూడపల్లి పిఎసిఎస్‌కు మూడునెలలు గా జీతాలు లేవని, దీనికి తోడు బ్యాంక్ మేనేజర్ మల్లాడి వీర వెంకట సత్యనారాయణ ఎ.స్టీవెన్ పాల్ వేధింపులకు గురిచేస్తు న్నాడని, కంప్యూటరైజేషన్ పేరుతో పని ఒత్తిడి పెంచి మానసికంగా వేధిస్తున్నారని బాధితుడు సత్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సత్యనారాయణను పలు సొసైటీల సిఇఒలు, సిబ్బంది పరామర్శించారు. దీనిపై బ్యాంక్ మేనేజర్ స్టీవెన్ పాల్‌ను వివరణ కోరగా గూడపల్లి సొసైటీ కంప్యూట రైజేషన్‌లో వెనుకబడి ఉందని, రికార్డులు సక్రమంగా లేవని అన్నారు. సెప్టెంబర్ వరకూ జీతాలు తీసుకున్నారని, అక్టోబర్ నెల జీతం మాత్రమే పెండింగ్ ఉందని అన్నారు. ఈ ఘటనపై మలికిపురం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది.

10 లీటర్ల సారా స్వాధీనం

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని మల్లిశాల గ్రామ శివారులో బుధవారం సారా భట్టీపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో అప్పికొండ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని, 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. సారా తయారీకి సిద్ధం చేసిన 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎస్ఐ రఘునాథరావు తెలిపారు. ముద్దాయిని కోర్టులో ప్రవేశపెట్టగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించారని ఆయన తెలిపారు.

సైబర్ వలలో శంఖవరం కాంట్రాక్టర్

ప్రజాశక్తి - శంఖవరం

సైబర్ మోసానికి ఒక కాంట్రాక్టర్ మోసపోయిన సంఘటనపై అన్నవరం పోలీస్ స్టేషన్లో కేసు నమోదు అయింది. దీనికి సంబంధించిన వివరాలు ఇలావున్నాయి..శంఖవరం గ్రామానికి చెందిన ఒక సివిల్ కాంట్రాక్టర్ తన వ్యాపారం నిమిత్తం సిమెంట్‌ను ఆన్‌లైన్‌లో సెర్చ్ చేశారు. సైబర్ నేరగాళ్లు దానిని గమనించి కాంట్రాక్టర్‌ను ట్రాప్ చేసి తక్కువ ధరకే సిమెంట్ విక్రయిస్తామని నమ్మించి కాంట్రాక్టర్ నుంచి రూ.5.20 లక్షలను కొట్టేశారు. కాంట్రాక్టర్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హరిబాబు తెలిపారు.

పోర్ట్ చెక్‌పోస్టులో జెసి ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - కాకినాడ

పోర్టు సమీపంలోని శక్తి గేట్ అండ్ బొంబే కాట చెక్ పోస్టును జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చిన ప్రతి లారీలో ఉన్న సరుకును తనిఖీ చేసి పంపించాలని ఆదేశించారు. ఈ తనిఖీలో ఎన్ని లారీలు వెళ్ళాయి? ఏమేమి సరుకు వెళ్లింది? లారీలో ఎంత సరుకు వెళ్ళింది? వంటి వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు.

దాడులపై బిఎస్‌పి ఖండన

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

మతపరమైన దాడులను బహుజన్ సమాజ్ పార్టీ ఖండిస్తోందని ఆ పార్టీ అమలాపురం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి, క్రిస్టియన్ కోఆర్డినేషన్ కౌన్సిల్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు జె.ధర్మరాజు పేర్కొన్నారు. ఉప్పలగుప్తంలో బుధవారం ధర్మరాజు మాట్లాడుతూ దళిత క్రైస్తవ ఎస్‌వి యూనివర్శిటీ ప్రొఫెసర్ సిహెచ్.చంగయ్యపై కాషాయి మత సాంఘిక శక్తులు విధుల్లో ఉండగా దాడి చేసిన సంఘటనను ఖండిస్తున్నామన్నారు. ఇటువంటి దారుణానికి పాల్పడిన భజరంగ్ దళ్ దుండగులపై తక్షణమే ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేసి, ఇటువంటి అమానుషమైన చర్యలు పునరావృతం కాకుండా చూడాలన్నారు.

అపార్ పేరుతో ఒత్తిడి చేయడం తగదు

ప్రజాశక్తి - కాకినాడ

అపార్ పేరుతో ఉపాధ్యాయులను ఒత్తిడికి గురి చేయడం మానుకోవాలని యుటిఎఫ్ విజ్ఞప్తి చేసింది. బుధవారం జిల్లా విద్యా శాఖ అధికారి కార్యాలయ ఎడి వినయ్ మోహన్‌కు యుటిఎఫ్ నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు కెవివి.నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి తోటకూర రవిచక్రవర్తి, కోశాధికారి పివిఎన్.గణేశ్ మాట్లాడారు. అపార్ పేరుతో 10 శాతం సెలవులు మాత్రమే ఇస్తామని, హోలిస్టిక్ ప్రోగ్రాం కార్డులు, 10వ తరగతి 100 రోజుల ప్లాన్ పేరుతో ఉపాధ్యాయులను ఒత్తిడికి గురి చేస్తున్నారని అన్నారు. తక్షణమే ఈ విధానాన్ని మానుకోవాలని, లేకుంటే డిఇఒ, డైరెక్టర్ కార్యాలయాల వద్ద ఆందోళన తప్పదని హెచ్చరించారు.

రోడ్ల అభివృద్ధికి నిధుల మంజూరు

ప్రజాశక్తి - కోటనందూరు

తుని నియోజ కవర్గంలో బిటి రోడ్లు అభివృద్ధికి రూ.3.25 కోట్లు మంజూరు అయ్యాయని ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ యనమల దివ్య అన్నారు. బుధవారం తేటగుంటలోని టిడిపి కార్యాలయంలో ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తొండంగి మండలంలో కోస్టల్ రోడ్డు నుంచి గడ్డిపేట గ్రామం వరకు రూ.35 లక్షలు, కొత్త చోడిపల్లిపేట గ్రామానికి రూ.35 లక్షలు, పాత చోడిపల్లి పేట గ్రామానికి రూ.70 లక్షలు, హుకుంపేట రోడ్డుకు రూ.60 లక్షలు నిధులు కేటాయించామన్నారు. తుని రూరల్ ప్రాంతమైన ఎన్.సుర వరం గ్రామం నుంచి ఎన్ఎన్.పట్నం గ్రామం రోడ్డు నిర్మాణానికి రూ.90 లక్షలు కేటాయించినట్లు చెప్పారు.